# ప్రతిఫలం

## ప్రఫుల్లచంద్ర

**ముద్రారావు వెనుక తాతలు మిగిల్చిపోయిన బోలెడు ఆస్తి వుంది. తండ్రి ఒదిలి పెట్టిపోయిన ప్రింటింగ్ ప్రెస్ వుంది. అతని గుండెనిండా ధైర్యం, తలనిండా లెక్కలూ వున్నాయి.**

ఆన్సర్ దొరకని ఒక లెక్కతో సతమతమౌతూ-తన "ఛాంబర్స్"లో కూర్చుని గంభీరంగా అరమోడ్పు కన్నులతో స్ప్రింగ్ డోర్స్ వైపు చూశాడు ముద్రారావు.

ఆ చిరు డోర్స్ వెనుక -

లోనికి వెళ్లాలా - వద్దా అని పది నిముషాలనుండి మధనపడిపోతూ నిలచి వుందొక నీడ.

ఆ నీడ రచనల్రావుది! అతడు ముద్రారావుకు చిననాటి మిత్రుడు.

రచనల్రావు వెనుక తాతలు మిగిల్చిపోయిన తాళపత్ర గ్రంథాలు, ప్రబంధాలు, నీతిశతకాలూ వున్నాయి. తండ్రి ఒదిలిపోయిన తనఖా దస్తావేజు లున్నాయి. అతని తలనిండా ఆలోచనలు, గుండెనిండా ఆశలూ, పిక్కలనిండా బలం వున్నాయి.

ఒకప్పుడు ఉద్యోగమూ వుండేది. ఇప్పుడు లేదు. అయితే పిక్కల్లో బలం వుంది కాబట్టి, కాళ్లకి బలపాలు కట్టుకొని పత్రికల ఆఫీసులచుట్టూ తిరిగాడు. ప్రింటింగ్ ప్రెస్‌లచుట్టూ ప్రదక్షిణాలు చేశాడు.

ఉద్యోగంకోసం ఎవరైనా ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరుగుతారు కాని అతడా పనిచేయలేదు. అందుకు కారణమూవుంది!

అతని ఊపిరి - రచనలు!

అతని ఆలోచనలు - రచనలు!!

అతని పెన్ పేరు - రచన!

అతని పేరే - రచనల్రావు!!

పత్రిక ఆఫీసుల్లో తప్ప యితర ఆఫీసులలో అతనికి ఊపిరి ఆడదు. రోజుకోసారి ప్రింటింగ్ ప్రెస్ చూస్తేగాని అతని గుండె కొట్టుకోదు!

ఆ ప్రెస్ చూశాక, దాని యజమాని- తన చిన్ననాటి స్నేహితుడే అని గుర్తుకు తెచ్చుకున్నాక రచనల్రావు మనసు ఆగలేదు. పదిపైసలు పెట్టి మరమరాలు కొని మూటకట్టుకొచ్చి అదిగో అలా స్ప్రింగ్ డోర్స్‌కి అతుక్కుపోయాడు.

తీరా లోనికి వెళ్తే- స్నేహితుడు తనని గుర్తిస్తాడో లేదో, గుర్తించినా "మరమరాలు తెస్తావురా, ఫూల్! నేనంత చవకగా కనిపిస్తున్నానా? గెట్ అవుట్" అంటాడేమోనని సంశయం......

అలా పదినిమిషాలు గుంజాటనపడి- చివరకు ధైర్యం చిక్కబట్టి, తలుపులు గట్టిగా నెట్టి "హాయ్! ముద్రలూ!" అని అరుస్తూ ముందుకు దూసుకుపోగా-

కుర్చీలో కూర్చున్న ముద్రారావు త్రుళ్ళిపడి, రచనల్రావుని చూసి గుర్తించినవాడై, ఒక్కసారిగా కుర్చీలోనుంచి లేచి టేబుల్‌ని మీదుగా ఒక్కదూకు దూకి స్ప్రింగ్ డోర్ వైపు దూసుకురాగా-

పట్టాలు తప్పిన రైళ్ళులాగ అటు ముద్రారావు గోడని ఢీకొని "హబ్బా!" అని అరవగా, ఇటు రచనల్రావు టేబుల్ గుద్దుకొని "హమ్మా" అని అరిచాడు!

తర్వాత యిద్దరూ వెనక్కి తిరిగి కుంటుతూ నడిచివచ్చి కౌగిలించుకొని ఆనంద బాష్పాలు రాల్చాలనుకున్నా అది రాలక ఆ ప్రయత్నం విరమించి యిద్దరూ టేబుల్ మీద కూర్చున్నారు.

భళ్ళుభళ్లున కబుర్లు చెప్పకుని ఘొల్లుఘొల్లున నవ్వుకున్న తర్వాత ముద్రారావు టీ తెప్పించాడు. రచనల్రావు మూట విప్పి ఆ టీలో మరమరాలు పోశాడు. మరమరాలు నములుతూ, టీ తాగుతూ వుండగా రచనల్రావుకి ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది.

"ఇదిగో ముద్రలూ! నీ కెలాగూ ఒక ప్రెస్ వుందికదా. ఒక వారపత్రిక ప్రారంభించి నన్ను ఎడిటర్‌గా వేసుకోరాదూ?" అన్నాడు. కాస్త ఆశ, మరికాస్త వేళాకోళం కలగలిపిన స్వరంతో.

ముద్రారావు తలలో యింతవరకూ ఆన్సర్ దొరకని ఏదో లెక్కకు యిప్పుడు టక్కున ఆన్సర్ దొరికినట్లు అయింది.

తనది అత్యంత ఆధునికమైన ప్రెస్. కాని టౌన్ నిండా ఎక్కడపడితే అక్కడ ప్రెస్‌లుండటం వల్ల తన ప్రెస్‌లో చేతినిండా పనిలేదు. కాని వర్కర్స్‌మాత్రం జేబునిండా జీతాలు పట్టుకుపోతున్నారు. నిజమే! తను ఒక పత్రిక ప్రారంభిస్తే- వర్కర్స్‌కి చేతినిండా పని కల్పించవచ్చు- అదనపు జీతం యివ్వకుండా.

ముద్రారావు ముఖం గంభీరంగా మారిపోయింది. మరమరాలు నములుతున్న దవుడ ఆగిపోయింది. గబగబా మనసులోనే లెక్కలు వేసుకున్నాడు.

కొత్త పత్రిక కాబట్టి రచయితలకు పారితోషికం యివ్వనక్కరలేదు. రెండు మూడు వేల కాపీలు అమ్మగలిగితే లాభం నష్టం లేకుండా బయటపడవచ్చు. ముఖ్యంగా- వర్కర్స్ నుండి యిస్తున్న జీతానికి సరిపడా పని రాబట్టుకోవచ్చు.

రచనల్రావు- మిత్రుని ముఖం ఆసక్తిగా, ఆశగా పరిశీలిస్తున్నాడు.

"పోరా, నీ ముఖానికి పత్రిక ఒకటీ! నిన్ను నమ్ముకుని పత్రిక పెడితే చిత్తుకాగితాల వ్యాపారం చేయాలి!" అనలేదు ముద్రారావు. పైగా గంభీరంగా టేబుల్ మీద నుండి కిందకు దిగి కుర్చీలో రివిగా కూర్చున్నాడు.

రచనల్రావుకి సూచన అందింది! తనూ టేబుల్ దిగి ఎదురుగా వినయంగా నిల్చున్నాడు.

"ఒరేయ్ ముద్రలూ! ఇకనుండి నిన్ను అలా పిలవను. నువ్వు పత్రిక పెడితే నిన్ను బాస్ అని పిలుస్తా. విధినిర్వహణలో మన స్నేహాన్ని వాడుకోను! భయపడకు!" అన్నాడు ఆశగా.

అప్పటికి తేరుకున్న ముద్రారావు చిన్నగా నవ్వేస్తూ "పత్రిక ప్రారంభించడానికేం గానీ, అసలు నువ్వు ఎడిటర్‌గా పనికొస్తావా అని!" అన్నాడు సగం అనుమానం, సగం వేళాకోళం కలగలిపి.

"రెండు మూడు పత్రికల్లో సబ్ ఎడిటర్‌గా పనిచేశాను, బాస్! చాకిరీ అంతా నాది, పేరు మాత్రం సంపాదకుడిది! అదీకాక నా మనసుకు వ్యతిరేకంగా సంపాదకీయాలు రాయవలసివచ్చేది. అందుకు నేను అంగీకరించకపోవడం వల్ల ఉద్యోగం ఊడింది" అన్నాడు రచనల్రావు బాధగా.

భవిష్యత్తులో నన్ను కూడా ఎదిరించడుకదా వీడు!- అన్న అనుమానాన్ని- అప్పుడు చూసుకోవచ్చులే- అన్న ధీమాతో ఆవలకు నెట్టి, అర్జంట్‌గా ఒక నిర్ణయాన్కి వచ్చేశాడు ముద్రారావు

* * * * * * * * * * *

ఉగాదినాడు "ఊహల ఊయల" కొత్త పత్రిక ప్రారంభం అయింది.

మొదట్లో పత్రిక సర్క్యులేషన్ అంతంత మాత్రమే. అయితే ముద్రారావు కోరిక నెరవేరింది. ప్రెస్ వర్కర్స్‌కిప్పుడు చేతినిండా పని! అదనపు ఖర్చులేదు. పత్రిక వల్ల నష్టం రాలేదు! అంతేచాలు!

అయితే రచనల్రావుకి ప్రతిభవుంది. దీక్ష వుంది. సత్తావుంది. తానేమిటో నిరూపించుకోవాలన్న పట్టుదల వుంది.

అతనికి ప్రజల నాడి తెలుసు.

కొత్త కొత్త శీర్షికలతో పత్రిక పుంజుకుంది.

నవలేష్ ఈ దశాబ్దపు రచయిత. రెండు చేతులతోనూ ఏక కాలంలో రెండు నవలలు రాయగల దిట్ట! అతని సీరియల్ వుందంటే

చాలు! పత్రికను ఎగరేసుకుపోతారు పాఠకులు.

అతనితో కాస్త పరిచయం వుంది. రచన్రావుకి.

ఆయన యింటికి వెళ్లేడు. ఆ సమయంలో ఆయన రెండు చేతుల్తోనూ రెండు నవలలు రాసేస్తున్నాడు.

రచన్రావుని చూడగానే చిన్నగా నవ్వి, కూర్చోమని సైగచేశాడు. ప్రక్కనే ఫోన్ మోగుతున్నా పట్టించుకోలేదు ఆయన. ఫోన్ ఎత్తితే - ఆ చేతితో రాస్తున్న నవల ఆగిపోతుంది మరి!

ఫోన్ మోగ్గిమోగి ఆగిపోయాక - "మాకొక నవల కావాలండీ" అన్నాడు రచన్రావు వినయంగా.

"చూస్తున్నారుగా! రెండు చేతులకూ ఖాళీ లేదు. ఇక కాళ్లతో రాయడం నేర్చుకోవాలి" అని నవ్వేశాడు నవలేష్.

అంతమాత్రానికే ఒదిలిపెట్టే రకంకాదు రచన్రావు.

"మీ చేతులకు ఖాళీలేదు. నిజమే. కానీ నోరు ఖాళీగానే వుందికదా! మా బామ్మరిది కూడా ఖాళీగానే వున్నాడు. వాడ్ని మీ యింటికి పంపుతాను. మా కొక నవల డిక్టేట్ చేసి పెట్టండి. అదో కొత్తదనం! పైగా ఏకకాలంలో మూడు నవలలు సృష్టించిన ఘనత మీకు దక్కుతుంది. అదో రికార్డుకూడానూ! ఈ దెబ్బతో మీరు గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కవచ్చు" ఆశపెట్టాడు రచన్రావు.

గిన్నిస్‌బుక్‌లో దూరాలని అందరికీ ఉబలాటమే.

నవలేష్ వెంటనే ఒప్పుకున్నాడు.

కరంట్ రాకడ, నవల పోకడ - ఎవరూ చెప్పలేరు. ఒక్కో నవలని దెయ్యాలూ భూతాలూ ఆకాశానికెత్తేస్తాయి. అవే భూతాలు మరో నవలని పాతాళంలోకి తొక్కేస్తాయి!

నవలేష్ రెండు చేతులతోనూ రాసిన రెండు నవలలూ, ఒక్క నోటితో డిక్టేట్ చేసిన నవలా - ప్రజల్లోకి ఒకేసారి వెళ్లాయికాని, డిక్టేట్ చేసిన నవల బ్రహ్మాండంగా క్లిక్ అయి ఊహలఊయలను ఆకాశానికి ఎత్తేసింది.

అధిక సర్క్యులేషన్ గల పాత పత్రికల సరసన రీవిగా కూర్చొని "హలో" అని పలకరించగల స్థాయికి ఎదిగింది కొత్త పత్రిక.

ముద్రారావు ఉప్పొంగిపోయాడు. రచన్రావు ఛాతీ ఉబ్బిపోయింది.

* * * * * * * * * * * *

జన్మదిన సంచిక అత్యద్భుతంగా తయారుచేయాలని రెండు నెలల ముందుగానే రచన్రావు ప్రయత్నాలు మొదలుపెట్టాడు. అనేకరకాల పోటీలు ప్రవేశపెట్టాడు.

ఉన్నట్టుండి అతనికో బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది.

పాఠకులు తెలివిమీరిపోయారు. ఫలానా పత్రికలో కథలు ఫలానా విధంగా వుంటాయని ముందుగానే ఊహించగలుగుతున్నారు. సంపాదకుని అభిరుచులను వాళ్లు పసిగట్టగలుగుతున్నారు. అందువల్ల కొన్ని లాభాలున్నా, నష్టంకూడా లేకపోలేదు. ఫలానా సంపాదకుడు వున్నంతకాలం ఆ పత్రిక చదవనక్కరలేదు! అని అభిప్రాయానికొచ్చేస్తారు కొందరు!

ఎంత ప్రమాదం!

తమ పత్రిక విషయంలో అలా జరగడాన్కి వీల్లేదు!

ఇంట్లో భార్య చక్కగా వండిపెడుతున్నా, బోర్ కొడుతుంది కొందరికి. అలాంటివాళ్లు కొంతకాలం హోటల్ భోజనం అడపా దడపా చేస్తోంటే చాలు యింటి భోజనంమీద మక్కువ పెరుగుతుంది.

లేదా తను వండిన కూరనే - పక్కింటి పుల్లమ్మగారు యిచ్చారు - అని చెప్పి వడ్డిస్తే చాలు, "చాలా బాగుంది స్మీ" అని మింగి కూర్చుంటారు మగమహారాజులు.

అందుకే తమ పాఠకులకు "హోటల్ భోజనం" వడ్డించాలనుకున్నాడు రచన్రావు.

వెంటనే నవలేష్‌గారింటికి వెళ్లి "మా జన్మదిన సంచికను మీరే ఎడిట్ చేయాలి సార్" అన్నాడు.

ఆయనకూ మనసులో ఆ కోరిక వుందిగాని తీరికేలేదు.

"సరే, ఆ తిప్పలన్నీ నేనేపడతాను. కాని గౌరవసంపాదకుడుగా మీ పేరు వేసుకుంటాం' అన్నాడు రచన్రావు పరిష్కారంగా.

తల వూపాడు నవలేష్.

నవలేష్ గౌరవ సంపాదకత్వం గురించి ప్రచారం జోరు అందుకుంది. పాఠకుల ఆసక్తి ఉప్పొంగింది.

జన్మదిన సంచిక సూపర్‌హిట్ అయింది.

ఆ ఉత్సాహంలో పాఠకుల కోరికమేరకు తర్వాత రెండు సంచికలకు కూడా నవలేష్ గౌరవసంపాదకత్వం "వహించాడు."

* * * * * * * * * * * *

ఇప్పుడు "ఊహల ఊయల" అత్యధిక సర్క్యులేషన్ గల పత్రిక.

దాని సంపాదకుడు - రచన్రావు కాదు! నవలేష్.

ఇప్పుడు రచన్రావు ఉద్యోగంకోసం పత్రికల ఆఫీసులచుట్టూ తిరుగుతున్నాడు!

○

